ప్రజాశక్తి

బుధవారం 7 జూన్ 2023

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

ఉద్యోగాల పేరిట యువతకు గాలం

- రూ.లక్షల్లో వసూళ్లు.. నిరుద్యోగులకు కుచ్చుటోపీ
- నగరంలో 'హిందుస్థాన్ స్కౌట్స్' అనధికార దందాలు
- విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌కు ఫిర్యాదులు



హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ కార్యాలయం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉద్యోగాలిస్తామంటూ ప్రకటనలు, ప్రచారంతో పబ్బం గడుపుకునే సంస్థలు విశాఖలో నానాటికీ అధికమవుతున్నాయి. నిరుద్యోగులను ఆర్థికంగా దోపిడీ చేస్తూ వారి జీవితాలతో ఆటలాడుకోవడమే లక్ష్యంగా విశాఖలో పలు బోగస్ యాజమాన్యాలు కొనసాగుతున్నా వాటిపై ఎలాంటి చర్యలూ ఉండడం లేదు. చదువుకున్న యువతీ, యువకుల ఆశలను ఆసరాగా చేసుకుని దండుకునేందుకు నగరంలోని ఉత్తర నియోజకవర్గంలో ఓ బోగస్ సంస్థ తన దుకాణం తెరిచింది. ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి ఎదురుగా ఉన్న మేడపై ఓ ప్రాంగణంలో హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ పేరుతో ఈ మోసాలకు సదరు యాజమాన్యం పాల్పడుతోంది. ఉద్యోగాల కోసం ఎదురుచూసే యువతీ యువకులకు తమ సంస్థ ద్వారా, సంస్థలోనూ ఉద్యోగాలిస్తామంటూ ఎర వేస్తూ వారి నుంచి రూ.లక్షలు గుంజుకుంటూ అనేక మందికి ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో వారి భాగోతం తాజాగా బయటపడింది.

బోగస్ సంస్థలపై దృష్టిసారించని జిల్లా అధికార యంత్రాంగం

విశాఖ వంటి మెట్రోపాలిటన్ సిటీలో ఆర్థిక మోసాలు, నిరుద్యోగులకు టోకరా వంటివి షరామామూలుగానే సాగిపోతున్నా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం ఏ మాత్రమూ అప్రమత్తంగా ఉండడం లేదు. తాజాగా ఉత్తర నియోజకవర్గంలోని ఓ అధికార పార్టీ నాయకున్ని కొంతమంది నిరుద్యోగులు కలిసి తమకు జరిగిన అన్యాయంపై ఆయన వద్ద మొరపెట్టుకున్నారు. ఎవరెవరి వద్ద ఎన్ని సంవత్సరాలుగా ఎంతెంత దోపిడీ చేశారో వివరించారు. దీంతో సదరు నేత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌కు నేరుగా లేఖ రాశారు. 'హిందుస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్' అనేది ఒక బోగస్ సంస్థ అని, నిరుద్యోగులను మోసం చేస్తోందని రూఢీ అయ్యిందని, తన వద్దకు నలుగురు బాధితులు వచ్చారని ఆ లేఖలో పేర్కొన్నారు. తక్షణమే ఈ నకిలీ, అనధికార సంస్థపై చర్యలు తీసుకోవాలంటూ అందులో స్పష్టంగా ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ఈ సంస్థ కార్యకలాపాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని, తక్షణమే ఈ సంస్థపై చర్యల దిశగా ప్రభుత్వం వెళ్లాలంటూ ఆ లేఖలో సదరు నాయకుడు కోరారు.

బోగస్ వ్యవహారాలను పక్కదారిపట్టించే దిశగా..

ఈ నేపథ్యంలో హిందుస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ నిర్వాహకులు తాజాగా ఓ తెలుగు పత్రికలో ప్రకటన ఇస్తూ 'ఉద్యోగాలిచ్చేస్తున్నాం రండి' అంటూ ప్రచారం చేపట్టారు. స్కౌట్ ఉపాధ్యాయులు, గైడ్ ఉపాధ్యాయులు (స్త్రీ, పురుషుల)కు వందల సంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు వెబ్‌సైట్‌ను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.హెచ్‌ఎస్‌జిఆంధ్రప్రదేశ్.ఒఆర్‌జి అంటూ పేర్కొన్నారు. ఇలా ప్రధాన దినపత్రికలో ఇవ్వడం ద్వారా తమ అక్రమాలను కప్పిపుచ్చుకోవాలనే ప్రయత్నాల్లో యాజమాన్యం నిమగ్నమైందని నిరుద్యోగులు పలువురు ఆరోపిస్తున్నారు.

ఉపాధ్యాయులకు బదిలీ పాట్లు

- అత్యధిక పోస్టులు బ్లాక్‌లో పెట్టిన విద్యాశాఖ
- మైదానం నుంచి ఏజెన్సీకి పలువురు
- ఆప్షన్ గడువు పెంచాలంటున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉపాధ్యాయులు బదిలీ పాట్లు పడుతున్నారు. విద్యాశాఖ ఉపాధ్యాయ ఖాళీలు చూపించడంలోనూ, ఆప్షన్లు పెట్టుకొనే వ్యవధి తక్కువగా ఇవ్వడంతో వారంతా ఆందోళనకు గురవుతున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 3,500 మందికిపైగా ఉపాధ్యాయులు బదిలీ కానున్నారు. వీరంతా తమ పాయింట్లు ఆధారంగా బదిలీలకు సంబంధించిన ఆప్షన్లు పెట్టుకొనే అవకాశంలేకుండా విద్యాశాఖ చేసింది. అత్యధిక పోస్టులు బ్లాక్ చేసి, ఖాళీలు తక్కువ చూపించడంతో ఉపాధ్యాయులు ఆప్షన్లు పెట్టుకొనేందుకు అవస్థలు పడుతున్నారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జిటి పోస్టులను మూడు, నాలుగు, ఐదు తరగతులు కలిసిన పాఠశాలల్లోనూ, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లోనూ బ్లాక్ చేయకూడదన్న నిబంధనలున్నా ఆచరణలో అత్యధిక పోస్టులను విద్యాశాఖ బ్లాక్ చేసింది. దీంతో ఆప్షన్లలో పాఠశాలలను ఎంచుకొనే అవకాశం ఉపాధ్యాయులకు లేకుండా పోయింది. మైదాన ప్రాంతంలోని పోస్టులను బ్లాక్ చేసి, ఖాళీలు తక్కువగా చూపించడంతో దాదాపు 300 మంది ఎస్‌జిటిలు మిగతా 2లో..

796వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రైవేటీకరణ చేయరాదని డిమాండ్ చేస్తూ సుదీర్ఘకాలంగా సాగుతున్న ఉద్యమం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంగళవారానికి 796వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యకర్తలు, హాస్పటల్ వర్కర్లు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న విశాఖ నగరానికి వస్తున్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం లేదని, ప్రభుత్వ రంగంలోనే దీనిని కొనసాగిస్తామని ప్రకటన చేయాలని మిగతా 2లో..

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి.. సుజల స్రవంతి నిర్మాణమే శరణ్యం

▸ వార్త 5లో..

ఎన్‌టిఆర్ ఇళ్లకు బిల్లులు ఇవ్వం!

▸ వార్త 7లో..

మళ్లీ భారీగా రైళ్ల రద్దు

▸ వార్త 2లో..



జాతాలో రైతు ఉద్యమ పాటలను ఆలపిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

జోరుగా కౌలు రైతుల రక్షణ యాత్ర

సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగిన జాతా బృందం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట, చోడవరం

కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ అనకాపల్లి జిల్లా మునగపాకలో ప్రారంభమైన 'కౌలు రైతుల రక్షణ యాత్ర' రాష్ట్ర జాతా రెండో రోజైన మంగళవారం అనకాపల్లిలోని గవరపాలెం పాల కేంద్రం నుంచి ప్రారంభమై చోడవరం, బుచ్చయ్యపేట మండలాల్లోని పలు గ్రామాల్లో జోరుగా సాగింది. జాతా బృందం ఎక్కడికక్కడ కౌలు రైతుల కష్టాలను తెలుసుకుంది. గవరపాలెంలో ఈ జాతాను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ మిగతా 2లో..

అటవీ భూముల ఆక్రమణదారులపై చర్యలు

విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జిల్లాలో అటవీ భూముల ఆక్రమణదారులపై కఠిన చర్యలు చేపట్టాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా స్థాయి ఫారెస్ట్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం సంబంధిత శాఖల అధికారులతో అటవీ భూముల రక్షణ, సర్వే, జిల్లాలో హరిత వనాల పెంపకం, సముద్ర తీర ప్రాంత సంరక్షణ తదితర అంశాలపై నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ భూముల ఆక్రమణలు జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అటవీ అధికారులను ఆదేశించారు. అటవీ రక్షణలో భాగంగా అటవీ సంపద అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లాలో నిఘాను పటిష్టం చేయాలన్నారు. హరిత వనాల పెంపకంలో భాగంగా జులైలో 15 వేల మొక్కలకు జియో ట్యాగింగ్ చేసి, పూర్తి సంరక్షణ చర్యలతో



అధికారులతో సమావేశమైన కలెక్టర్ మల్లికార్జున

నాటేందుకు సిద్ధంగా ఉంచాలని ఫారెస్ట్, జివిఎంసి అధికారులను ఆదేశించారు. పరవాడ మండలం ఇస్లాంపేట గ్రామంలో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి సర్వే చేయాలని విఎంఆర్‌డిఎ అధికారులను ఆదేశించారు. విశాఖ ఆర్‌కె బీచ్‌లో కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధి పనులు చేపట్టి అదనపు లైట్లు, ఆర్టిఫిషియల్ లైట్లు ఎక్కడికక్కడ ఏర్పాటు చేయడం వల్ల సముద్ర తాబేళ్ల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అటవీ భూముల ఆక్రమణదారులపై చర్యలు

గుడ్ల ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోయిందని కలెక్టర్ దృష్టికి అధికారులు తీసుకురాగా ఆయన స్పందిస్తూ నో లైట్ జోన్లు ఏర్పాటు చేయాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 181 కేసులు బుక్ చేశామని, తద్వారా రూ.14.26 లక్షలు వసూలైందని డిఎఫ్ఒ అనంత శంకర్ ఈ సందర్భంగా తెలిపారు. నాలుగు వన్య మృగాల కేసులు వివిధ దశల్లో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లాలో గంజాయి పెంపకం, అక్రమ రవాణా లేకుండా చూడాలని, చట్ట విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. కొన్ని ప్రాంతాల్లో అక్రమ ఇసుక మైనింగ్ జరుగుతోందని, అరికట్టాలని అధికారులను ఆదేశించారు. అటవీ అధికారులు రెవెన్యూ, సర్వే ల్యాండ్ అధికారులతో జాయింట్ సర్వే చేసి అటవీ భూముల సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, జిల్లా ఫారెస్ట్ అధికారి అనంత్ శంకర్, జూ క్యూరేటర్ నందిని సలారియా, జివిఎంసి జోనల్ కమిషనర్ శ్రీనివాస్, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో నినదిస్తున్న సిఐటియు నాయకులు

796వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

డిమాండ్ చేశారు. ఆ రోజు తాము అమిత్ షా దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తామన్నారు. విభజన హామీలను అమలు చేయని కేంద్ర ప్రభుత్వం ఉత్తరాంధ్ర జిల్లాల్లో అతిపెద్ద పరిశ్రమైన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయటం శోచనీయమన్నారు. కార్యక్రమంలో అనపర్తి అప్పారావు, ప్రదీప్ కుమార్, జివిఎన్.చలపతి, కుమార్, జగన్, డి.అప్పారావు పాల్గొన్నారు.

జోరుగా కౌలు రైతుల రక్షణ యాత్ర

యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం చోడవరం మండలంలోని వెంకన్నపాలెం గజపతినగరం, జుత్తాడ, లక్కవరం, పిఎస్.పేట గ్రామాల్లో సాగింది. కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయా గ్రామాల్లో రైతులను చైతన్యపరుస్తూ సమావేశాలు నిర్వహించారు. ఆ తరువాత బుచ్చయ్యపేట మండలంలోని రాజాం, కందిపూడి, బుచ్చయ్యపేట, దిబిడి, చిన్నప్పన్నపాలెం, మీదుగా వడ్డాది చేరుకుంది. ఈ జాతాలో ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, కోశాధికారి గండి నాయన బాబు, వ్యవసాయ కార్మిక సంఘం బుచ్చయ్యపేట మండల కార్యదర్శి పినపాత్రుని సాంబశివరావు, దేవుళ్లు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బదిలీ పాట్లు

ఏజెన్సీలోకి వెళ్లే పరిస్థితి ఏర్పడనుంది. అలాగే పాఠశాలలకు పోస్టులు కేటాయింపు సరిగాలేవని ఉపాధ్యాయులు అంటున్నారు. గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లకు ఆప్షన్లు పెట్టుకొనే గడువు బుధవారంతో ముగియనుంది. ఆప్షన్లు పెట్టుకొనే అవకాశం మంగళవారమిచ్చి, బుధవారంతో గడువు ముగించడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు. పోస్టుల ఖాళీలు మంగళవారం సాయంత్రం పెట్టి.. బుధవారం నాటికి పూర్తిచేయాలని చెప్పడం ఉపాధ్యాయులను ఒత్తిళ్లకు గురిజేయడమేనని వారంటున్నారు. అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు ఆప్షన్లు పెట్టుకొనే గడువు గురువారం వరకూ పెంచాలని కోరుతున్నారు.

ఓలా యాప్
ఆటో కార్మికుల సమస్యపై వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలో ఓలా యాప్ ఆధారంగా నాలుగు వేల ఆటోలు ఆన్‌లైన్ లో తిరుగుతున్నాయని, ఆ కార్మికులకు ఏవైనా సమస్యలు వస్తే పరిష్కరించుకునేందుకు కనీసం కార్యాలయం కూడా నగరంలో లేకపోవడం శోచనీయమని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ అన్నారు. మంగళవారం యూనియన్ తరపున డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓలా యాప్ ద్వారా ముందుగా ఒప్పందం తీసుకున్నా, అన్ని సౌకర్యాలూ ఇప్పుడు ఇవ్వడం లేదన్నారు. డీజిల్ ధరలు పెరగడం వల్ల తమకు ఇప్పుడు ఇస్తున్న కిలో మీటర్ ఛార్జీలు గిట్టుబాటు కావడం లేదన్నారు. కనీసం రోజుకు రూ.500 కూడా మిగలడం లేదని, అందువల్ల తాము ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. ఓలా మేనేజ్‌మెంట్ వారిని విన్నవించుకున్నా, వారు ఎటువంటి పరిష్కారమూ చూపలేదన్నారు. కార్యక్రమంలో ఓలా గ్రూప్ ఆటో కార్మికులు ప్రకాష్, శేషుబాబు, వరప్రసాద్, అప్పారావు పాల్గొన్నారు.

భారీగా రైళ్ల రద్దు

ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ నుంచి షాలిమార్‌కు ప్రత్యేక రైలు
- నేటి నుంచి పట్టాలెక్కనున్న కోరమాండల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కోరమాండల్ రైలు ప్రమాదం జరిగిన బహనాగా బజార్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనిలో భాగంగా ట్రాక్ వేయడం వల్లనూ, ర్యాక్‌లు అందుబాటులో లేకపోవడం వల్లనూ పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి మంగళవారం ప్రకటించారు. జూన్ 6న 12863 హౌరా- ఎస్ఎంవి బెంగుళూరు టెర్మినల్ ఎక్స్‌ప్రెస్, 18047 షాలిమార్-వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్, 12839 హౌరా-ఎంజిఆర్ చెన్నై మెయిల్, 22642 షాలిమార్-తిరువనంతపురం ఎక్స్‌ప్రెస్ రైళ్ళను, జూన్ 7న 12839 హౌరా-ఎంజిఆర్ చెన్నై మెయిల్, 18045 షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 18046 హైదరాబాద్ -షాలిమార్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 12842 చెన్నై సెంట్రల్ - షాలిమార్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, 22831 హౌరా-సత్యసాయి ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్, 22842 తాంబరం-సర్త్రాగచి ఎక్స్‌ప్రెస్, 12254 భాగల్పూర్-ఎస్ఎంవి బెంగుళూరు టెర్మినల్ ఎక్స్‌ప్రెస్, 22503 కన్యాకుమారి- దిబ్రూఘర్, 22849 షాలిమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, 12773 షాలిమార్- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, జూన్ 8న 12864 ఎస్ఎంవి బెంగుళూరు టెర్మినల్ - హౌరా ఎక్స్‌ప్రెస్, 22888 ఎస్ఎంవి బెంగళూరు - హౌరా హంసఫర్ ఎక్స్‌ప్రెస్, జూన్ 9న 18048 వాస్కోడగామా- షాలిమార్ ఎక్స్‌ప్రెస్, 22832 సత్యసాయి ప్రశాంతి నిలయం - హౌరా - ఎక్స్‌ప్రెస్, 12503 ఎస్ఎంవి బెంగళూరు-అగర్తలా హంసఫర్ ఎక్స్‌ప్రెస్. జూన్ 10న 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు.

పట్టాలెక్కనున్న కోరమాండల్

12841 షాలిమార్ - ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ సాధారణ సర్వీస్ జూన్ 7 నుంచి షెడ్యూల్ ప్రకారం షాలిమార్ నుంచి 15:20 గంటలకు బయలుదేరుతుంది. కోరమాండల్ ప్రమాద కారణంగా చిక్కుకుపోయిన ప్రయాణికుల రద్దీని క్లియర్ చేయడానికి ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ నుంచి షాలిమార్ వరకు ప్రత్యేక రైలును నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది.

02842 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-షాలిమార్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ నుంచి జూన్ 7 ఉదయం 7.00 గంటలకు బయలుదేరి, అదే రోజు రాత్రి 19.50 గంటలకు విశాఖపట్నం చేరుకుని మరలా 20.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.40 గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. ఈ రైలు ఒంగోలు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, విశాఖపట్నం, బ్రహ్మపూర్, ఖుర్ధా రోడ్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్ కియోంజర్ రోడ్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది.

పర్యావరణ పరిరక్షణకు రైల్వే కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు రైల్వే డివిజన్ సిబ్బంది పర్యావరణ పరిరక్షణకు కంకణం కట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం పర్యావరణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యతపై ఇతరులను చైతన్యపరుస్తామంటూ ప్రతిజ్ఞబూనారు. అనంతరం డివిజన్ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కమ్యూనిటీ పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి డాల్ఫిన్‌నోస్ కాలనీలో ఓపెన్ జిమ్నాసియంతో నూతనంగా అభివృద్ధి చేసిన చిల్డ్రన్స్ పార్కును ప్రారంభించారు. కాలనీలో ఎన్నో ఏళ్లుగా పొదలు, చెత్తా చెదారంతో నిండిన ఖాళీ స్థలంలో ఈ సౌకర్యం ఏర్పాటు చేసి కాలనీ వాసులకు మేలు చేసినట్టు వెల్లడించారు. రైల్వే స్టేడియంలో పునర్నిర్మించిన వాకర్స్ పార్కును ప్రారంభించారు. అనంతరం రైల్వే సిబ్బంది, ఈస్ట్ కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు పారిజాత సత్పతితో కలిసి మర్రిపాలెం నార్త్ రైల్వే కాలనీకి వెళ్లి మొక్కలు నాటారు.



చిల్డ్రన్స్ పార్కును ప్రారంభిస్తున్న రైల్వే డిఆర్ఎం అనుప్ సత్పతి

వి-డెంటల్ సేవాతత్పరత



మొక్కలు పంపిణీ చేస్తున్న రమేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శంకర మఠం రోడ్డులో వి - డెంటల్ హాస్పిటల్ వారు చేపట్టిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పంటి వైద్యంతో పాటు పచ్చదనం పెంపొందించడాన్ని తమ బాధ్యతగా భావించి 500 మొక్కలను, వేపతో తయారు చేసిన టూత్ బ్రెష్‌లను ఆసుపత్రి యాజమాన్యం పంపిణీ చేసింది. ఈ సందర్భంగా వి-డెంటల్ హాస్పిటల్స్ డైరెక్టర్ కెఎంకె.రమేష్ మాట్లాడుతూ ప్రజారోగ్యం ప్రకృతిపై ఆధారపడి ఉందన్నారు. మన జీవన విధానం పర్యావరణ హితంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. శంకరమఠం, లలితానగర్, మధురానగర్, శాంతిపురం ప్రాంతాలలో స్థానికులకు 500 మొక్కలు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, డాక్టర్ అమృత, హాస్పిటల్ అడ్మిన్ మేనేజర్ సిహెచ్.పార్వతి, కె.రమ్య, సిహెచ్.కృష్ణ, మేరి, ధరణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

డాక్టర్ శివానందకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెజిహెచ్ నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.శివానంద బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో అతన్ని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ జాన్‌వెస్లీ మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ శివానంద సేవలను కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి పెద్ద పీట వేస్తోందని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల పేదలకు పెద్దదిక్కుగా ఉన్న కెజిహెచ్‌లో రోగులకు ఇంకా మెరుగైన సేవలు అందించాలన్నారు. పాలనలో డాక్టర్ శివానంద తనదైన ముద్ర వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జివిఎంసి కో - ఆప్షన్ సభ్యులు ఎమ్‌డి షరీఫ్, వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షులు మన్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్ల సమస్యపై 20న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఓలా, ఉబర్ డ్రైవర్ల సమస్యలను తక్షణం పరిష్కరించాలని విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు బి.జగన్ డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓలా, ఉబర్ గూగుల్ యాప్‌ను డెవలప్ చేసి డ్రైవర్లను లింక్ చేసుకుంటున్నాయన్నారు. మొత్తం పెట్టుబడిని డ్రైవర్లు, ఓనర్లే పెట్టుకుంటారన్నారు. కానీ సదరు సంస్థలు 30 శాతం వరకు కమీషన్ తీసుకుంటున్నాయని, ఇది చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇదేంటని ప్రశ్నిస్తే అతని కారును ఆపేస్తున్నారన్నారు. ఈ విషయమై స్పందనలో జిల్లా కలెక్టర్‌కు విన్నవించినా సరైన పరిష్కారం చూపలేదన్నారు. నిర్లక్ష్యంగా సమాధాన మిచ్చారని తెలిపారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని డ్రైవర్ దగ్గర తీసుకుంటున్న కమీషన్‌ను 8 శాతానికి తగ్గించాలన్నారు. అలాగే పెట్రోల్, డీజిల్ ధరలకు అనుగుణంగా కిలో మీటర్ల రేట్లు పెంచాలన్నారు. అక్రమంగా తొలగించిన డ్రైవర్లందరినీ విధుల్లోకి తీసుకోవాలన్నారు. సమస్యలపై పోరాటాన్ని ఉధృతం చేసే క్రమంలోనే ఈ నెల 20న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీరాములు, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, ఆనంద్, పోలినాయుడు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

అరకులోయ: గిరిజన క్రీడాకారులకు ప్రభుత్వపరంగా ప్రోత్సాహాన్ని అందించనున్నట్లు ఐటిడిఎ పిఒ అభిషేక్ భరోసానిచ్చారు. బెంగళూరులోని కంఠీరవ ఇంటర్నేషనల్ స్టేడియంలో నిర్వహించిన టిసిస్ వరల్డ్ 10కే రన్ పోటీల్లో పాల్గొని, ప్రతిభ కనబరచడం ద్వారా ఈ ఏడాది చివరలో డిసెంబర్ 10న గోవాలో జరిగే మారథాన్ పోటీలను ఎంపికైన అరకులోయ మండలం గరడగుడ గ్రామానికి చెందిన గిరిజన క్రీడాకారుడు కిల్లో బుద్ధు, అనంతగిరి మండలం తుమ్మనవలస గ్రామానికి కొర్ర గోపిలను పిఒ అభిషేక్ అభినందించారు

భీమిలిలో జివిఎంసి కమిషనర్ పర్యటన



నమ్మివానిపేట డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ మంగళవారం 1, 2, 3 వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. ఒకటో వార్డు పరిధి విద్యుత్ సబ్ స్టేషన్, దివీస్ పార్కు వద్ద రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రధాన కాల్వలో పూడిక తీసి, శుభ్ర పరచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మీ నాయుడును ఆదేశించారు. రోడ్డుకిరువైపులా ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలు, వ్యక్తులకు సంబంధించి గోడలపై వ్యాపార ప్రకటనలు ఉండడాన్ని ఆయన గుర్తించి వెంటనే వాటిని తొలగించాలని, సంబంధిత ప్రకటనల యాజమానుల నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండో వార్డు పరిధిలోని డంపింగ్ యార్డును పరిశీలించారు. సేంద్రియ ఎరువుల విధానాన్ని పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇక్కడ ఉన్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించాలని శానిటరీ సూపర్‌వైజర్లను ఆదేశించారు. ప్రధాన రహదారుల వెంబడి శుభ్రత లేకపోవడాన్ని గుర్తించి శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రామును ఆదేశించారు. అదే వార్డు గొల్లలపాలెం విఎంఆర్‌డిఎ ఇండోర్ స్టేడియాన్ని, మూడో వార్డు పరిధిలో ఉన్న మినీ క్రికెట్ స్టేడియాన్ని ఆయన పరిశీలించారు. విద్యుత్, మరుగుదొడ్లు, వాకింగ్ ట్రాక్, తాగు నీరు, ప్రహరీ నిర్మాణం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానిక క్రీడాకారులు కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఇందుకు అవసరమైన అంచనాలు రూ పొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి బుధవారం యూజర్ చార్జీల వసూలుకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్‌పై దృష్టిపెట్టాలని శానిటరీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారత్‌లో పెరుగుతున్న బ్రెయిన్ ట్యూమర్

- కిమ్స్ ఐకాన్ డాక్టర్ అచ్చయ్యనాయుడు



ప్రజాశక్తి -గాజువాక : భారత్లో బ్రెయిన్ ట్యూమర్ల సంఖ్య పెరుగుతోందని షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ కె.అచ్చయ్యనాయుడు తెలిపారు. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ కేన్సర్ రిజిస్ట్రీస్ ప్రకారం, భారతదేశంలో ప్రతి సంవత్సరం 28 వేల కంటే ఎక్కువ బ్రెయిన్ ట్యూమర్ కేసులు నమోదవుతున్నాయని, ఏటా 24 వేల మందికి పైగా ఈ వ్యాధితో మరణిస్తున్నట్లు నివేదించినట్లు తెలిపారు. మెదడు కణితులను ముందుగా గుర్తించి చికిత్స చేయకపోతే ప్రాణాంతకం కావచ్చని చెప్పారు. బ్రెయిన్ ట్యూమర్లకు ఖచ్చితమైన కారణాన్ని గుర్తించేందుకు విస్తృతమైన పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. చిన్నతనంలో లుకేమియా వంటి కేన్సర్ ఉన్నవారికి పెద్దయ్యాక మెదడు కణితులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వివరించారు. తలనొప్పి, మూర్ఛ, చూపు మందగించడం, వాంతులు, గందరగోళం, ముఖం లేదా అవయవంలో బలహీనత, మూర్ఛత్వం, జ్ఞాపకశక్తి కోల్పోవడం, మానసిక స్థితి, ప్రవర్తనలో మార్పులు, కనురెప్పలు పడిపోవడం, మైకము, శరీరం యొక్క ఒక వైపు జలదరింపు, ప్రేగు లేదా మూత్రాశయం నియంత్రణ కోల్పోవడం ఈ వ్యాధి లక్షణాలని తెలిపారు.

కణితిలోని ఒక చిన్న భాగాన్ని అతితక్కువ ఇన్వాసివ్ సర్జరీ ద్వారా తొలగించి, అది నిరపాయమైనదా లేదా ప్రాణాంతకమైనదా అని నిర్ధారించడానికి పరీక్షిస్తారని తెలిపారు. వైద్య సహాయం కోసం వచ్చే వారికి అవగాహన కల్పించడం, సరైన సమయంలో, ప్రారంభ దశల్లో శస్త్రచికిత్స చేయడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

8న కోస్టల్ క్లీన్ అప్

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రపంచ మహా సముద్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల ఆధ్వర్యాన ఈ నెల 8న జూ పార్కు సాగర ద్వారం వద్ద చేపట్టే కోస్టల్ క్లీన్ అప్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జూ క్యూరేటర్ డాక్టర్ నందని సలారియా పిలుపునిచ్చారు. 8వ తేదీ ఉదయం 6 గంటలకు మహాసముద్రాలు, సముద్ర పర్యావరణ వ్యవస్థలను ఎలా రక్షించుకోవాలి తదితర విషయాలపై అవగాహన కల్పించేందుకు కోస్టల్ క్లీన్ అప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9441130894, 7893632900 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

స్మార్ట్ నానో టెక్నాలజీపై గీతంలో సదస్సు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం, ఖతార్‌లోని ఖతార్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా జులై 6 నుంచి 8వ తేదీ వరకు అంతర్జాతీయ సదస్సును విశాఖలోని గీతం ప్రాంగణంలో నిర్వహించ నున్నాయని స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.శ్రీకృష్ణ తెలిపారు. వివిధ దేశాల నుంచి 50 మందికిపైగా శాస్త్రవేత్తలు ఈ సదస్సుకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. సదస్సులో బయోమెటీరియల్స్, సోలార్ సెల్స్, సెమీకండక్టర్ టెక్నాలజీ, హైడ్రోజన్ ప్రొడక్షన్, స్మార్ట్‌నానో సెన్సార్స్, టిష్యూ ఇంజనీరింగ్, త్రిడి, 4డి ప్రింటింగ్, హైటెక్ డివైజస్, ఇనార్గానిక్, సాఫ్ట్ మెటీరియల్స్ అంశాలపై నిపుణుల ప్రసంగాలు ఉంటాయని సదస్సు కో-కన్వీనర్ ప్రొఫెసర్ అనీమా దధిచి తెలిపారు. సదస్సులో పాల్గొనదలచిన వారు ఈ నెల 15వ తేదీలోగా వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

గోస్తనీపై వంతెన పనులు ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ దివీస్ సంస్థ సిఎస్ఆర్ నిధులు రూ.2.98 కోట్లతో మండలంలోని టి.నగరపాలెం కమ్యూనిటీ హాల్ నుంచి ఎల్లారమ్మ గుడి వరకు గోస్తనీపై వంతెన నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. వంతెన నిర్మాణ పనులకు ఏప్రిల్ 30న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, దివీస్ యాజమాన్య ప్రతినిధులు, సర్పంచ్, ఎంపిటిసి సభ్యులతో కలిసి భూమి పూజ చేసిన విషయం విదితమే. నిర్ణీత వ్యవధిలో వంతెన నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్న హామీ మేరకు పనులు ప్రారంభించడం పట్ల స్థానికులు హర్షం వెలిబుచ్చారు.

నీటిని శుద్ధి చేయాలి : వెలగపూడి



ముడసర్లోవ రిజర్వాయర్ వద్ద పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ రిజర్వాయర్ నుంచి జివిఎంసి సరఫరా చేసే నీటిని పూర్తి స్థాయిలో శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేయాలని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన తూర్పు నియోజకవర్గం టిడిపి నాయకులతో కలిసి ముడసర్లోవ రిజర్వాయర్ నీటిని శుద్ధి చేసే గ్యాలరీని, రిజర్వాయర్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముడసర్లోవ రిజర్వాయర్ నుంచి సరఫరా చేస్తున్న నీరు గత కొంతకాలంగా చాలా అధ్వానంగా వస్తుందన్నారు. బ్రిటీష్ కాలం నుంచి ఉన్న శుద్ధి చేసే గ్యాలరీ పూర్తిగా పాడైపోయిందని తెలిపారు. రిజర్వాయర్ నీటిని శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కోట్లు వెచ్చించి రిజర్వాయర్ చుట్టూ రక్షణ గోడ నిర్మించాంచారే తప్ప, ప్రజలకు అవసరమయ్యే మంచినీటి సరఫరాపై శ్రద్ధ తీసుకోకపోడం అన్యాయమన్నారు. కూత వేటు దూరంలో నివాసం ఉండే నగర మేయర్ ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ రిజర్వాయర్ నీటిని శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి చేసి సరఫరా చేయాలని, లేకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఒమ్మి సన్యాసిరావు, మద్దిల రామలక్ష్మి, రాజశేఖర్, బుడుమూరు గోవింద, పోతన్నరెడ్డి, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ముగడ రాజారావు, మజ్జి రమణి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారుల నుంచి సిబిసిఎన్‌సి హిల్ క్రెస్ట్ బంగ్లాను కాపాడాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : సిరిపురం జంక్షన్‌లోని సిబిసిఎన్‌సి హిల్ క్రెస్ట్ బంగ్లాను ఆక్రమణదారుల నుంచి కాపాడాలని సిబిసిఎన్‌సి ఆస్తుల పరిరక్షణ సమితి కన్వీనర్ డాక్టర్ ఆర్ఎస్.జాన్ డిమాండ్ చేశారు. సిబిసిఎన్‌సి ఆస్తులను పరిరక్షించాలని కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 1874వ సంవత్సరం మార్చి 12న ఆవిర్భవించిన సిబిఎం సంస్థ ఆస్తులను 1975వ సంవత్సరం మద్రాస్ హైకోర్టు తీర్పు ద్వారా సిబిసిఎన్‌సి ట్రస్ట్ అసోసియేషన్‌కు బదలాయించారన్నారు. 1979లో సంస్థ సభ్యుల మధ్య ఏర్పడిన భేదాభిప్రాయాలతో బాప్టిస్టులు, బాప్టిస్టేతరులుగా విడిపోయి సిబిసిఎన్‌సి ఆస్తులను అన్యాక్రాంతం చేస్తున్నారన్నారు. ఈ ఏడాది మార్చి 26న ఎంపీ ఎంవివి డెవలపర్ సిబిసిఎన్‌సి స్థలంలోని హిల్ క్రెస్ట్ బంగ్లా స్థానంలో ఎంవివి పీక్స్ నిర్మాణం కోసం భూమి పూజ చేసి పనులు ప్రారంభించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన ఓఎస్ 18/2009 డిక్రీ నందు టైటిల్ రైట్ ఎవరికీ దఖలు పరచలేదన్నారు. అపీలు నంబర్ 132/2017 ప్రకారం ఏపి హైకోర్టు స్టేటస్ కో-ఉత్తర్వులు ద్వారా త్యాగరాజ రత్నాకర్ హెగ్డే కొనసాగుతున్నారని వివరించారు. దీనికి సంబంధించిన టైటిల్ సిబిసిఎన్‌సికి మాత్రమే ఉందన్నారు. 2003 జనవరి 24న కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ రాసిన లెటర్ నంబర్ 3010/2002 ప్రకారం 1990 తరువాత సిబిసిఎన్‌సి గల ఏ కమిటీ కూడా గుర్తించబడలేదన్నారు. ఈ సమస్యలన్నింటినీ గమనించి జిల్లా కలెక్టర్, జివిఎంసి కమిషనర్, పోలీస్ కమిషనర్ తమ సంస్థ ఆస్తుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిబిసిఎన్‌సి ఆస్తుల పరిరక్షణ సమితి సభ్యులు ఎం.ఎ.పాల్, రంజిత్ ఒఫిర్, శ్యాం పాల్, జి.విజయరాజు, డాక్టర్ గెరా హనోక్, కె.మార్టిన్ పాల్గొన్నారు.

వెబ్ ఆప్షన్ నమోదుకు యుటిఎఫ్ సహాయ కేంద్రం



వెబ్ ఆప్షన్ నమోదు సహాయ కేంద్రం ప్రారంభంలో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఉపాధ్యాయుల బదిలీలు సందర్భంగా వెబ్ కౌన్సిలింగ్‌లో ఉపాధ్యాయుల సౌకర్యార్థం యుటిఎఫ్ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన వెబ్ ఆప్షన్ నమోదు సహాయ కేంద్రాన్ని మంగళవారం ఎన్ఎడి సమీపంలోని యుటిఎఫ్ విశాఖ జిల్లా కార్యాలయం (హమ్మీ భవన్)లో యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఎస్ఎస్.నాగమణి, అనకాపల్లి జిల్లా గౌరవాధ్యక్షులు నెల్లి సుబ్బారావు, విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్ అంబేద్కర్ ప్రారంభించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని కేడర్ల ఉపాధ్యాయులు తమ వెబ్ ఆప్షన్ నమోదుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. భీమిలి డివిజన్‌లో తగరపువలస కేంద్రంగా కూడా సహాయ కేంద్రం ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ అధ్యక్షులు రొంగలి ఉమాదేవి, ఎం.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి చుక్క సత్యం, రియాజ్ అహ్మద్, రిజ్వాన్, అనకాపల్లి జిల్లా నాయకులు పి.శ్రీకాంత్, కుమారి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం

ప్రజాశక్తి -తగరపువలస : క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం కలుగుతాయని భీమిలి ఎస్ఐ భరత్ కుమార్ రాజు అన్నారు. భీమిలి మండలం తాళ్లవలసలో ఈ నెల 3న క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైన విషయం విదితమే. మంగళవారం పోటీల్లో ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ప్రతి క్రీడాకారుడూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. టోర్నమెంట్ నిర్వాహకులను ఆయన అభినందించారు.

వడ్లపూడి రైల్వే బ్రిడ్జికి 14న టెండర్ ప్రక్రియ

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటో నగర్ ఈ బ్లాక్‌లో ఉన్న వడ్లపూడి రైల్వే బ్రిడ్జి పనులకు టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుంది. సేతు బంధు పథకం కింద రైల్వే బ్రిడ్జిని అభివృద్ధి చేయడానికి ఆర్ అండ్ బి శాఖ ఈ నెల 14వ తేదీన ఆన్‌లైన్‌లో టెండర్ ప్రక్రియ ప్రారంభించనుంది. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ బ్రిడ్జి టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత పనులు ప్రారంభిస్తారని అధికారులు తెలుపుతున్నారు. ఈ వంతెన పూర్తయితే 14 గ్రామాల ప్రజల రాకపోకలు అనుకూలంగా ఉంటుంది. పాత గాజువాక మీదుగా వెళ్లే వాహనాలు ఈ రహదారిని ఉపయోగించడం ద్వారా ట్రాఫిక్ తగ్గనుంది.



సగం పూర్తయిన వంతెన....

డయేరియాపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి- తగరపువలస : డయేరియా వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు తాళ్లవలస పిహెచ్‌సి వైద్యాధికారి ఎటి మల్లికార్జునరావు, డాక్టర్ సందీప్ సూచించారు. భీమిలి మండలం తాళ్లవలస పిహెచ్‌సిలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మల్లికార్జునరావు మాట్లాడుతూ, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణిలకు సాధారణ ప్రసవం జరిగేలా అవగాహన కల్పించాలని, ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరపాలని చెప్పారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి అమర్‌నాథ్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : మున్సిపల్ కార్మికుల సమస్యలను బుధవారం జరగనున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో చర్చించి పరిష్కరించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఆయన గృహంలో కలిసి యూనియన్ తరపున వినతిపత్రం అందించారు. అనంతరం వెంకటరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, జివిఎంసిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై గతంలో సమ్మె చేసిన సందర్భంగా అప్పటి కమిషనర్, ఇంజినీరింగ్ చీఫ్‌తో ఒప్పందం జరిగిందని, మినిట్స్ కూడా రాసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 18వ తేదీలోగా వాటిని అమలు చేయాలని, లేకుంటే 19వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. మంత్రి అమర్‌నాథ్ కల్పించుకొని ఈ సమస్యను కేబినేట్ సమావేశంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కరోనా సమయంలో విధులు నిర్వహించిన 18 మంది పారిశుధ్య కార్మికులు మృతిచెందారని, ఆయా కుటుంబాలకు కేంద్రం నుంచి గానీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి గానీ ఎటువంటి పరిహారమూ అందలేదన్నారు. కార్మికులకు గ్రాట్యూటీ చెల్లించని కారణంగా, వారి పిల్లలకు వారసత్వంగా అవుట్ సోర్సింగ్ ఉపాధి కల్పించడం లేదని తెలిపారు. 2008 జివిఎంసి కౌన్సిల్ తీర్మానం ప్రకారం, నేటి వరకు చనిపోయిన వారి పిల్లలకు, 60 ఏళ్లకు రిటైర్ అయిన, లాంగ్ ఆబ్సెంట్ అయిన కార్మికులు, అనారోగ్య కార్మికుల కుటుంబ సభ్యులకు అవుట్ సోర్సింగ్ ఉపాధి కల్పిస్తామని అంగీకరించారని గుర్తుచేశారు. ఆ నిర్ణయాలను నేటికీ అమలుచేయలేదన్నారు. ఇప్పటికైనా అటువంటి వారందరికీ ఉపాధి కల్పించాలని కోరారు. జివిఎంసిలో భర్తీ చేయనున్న 482 ఖాళీలలో కార్మికుల వారసులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్, నీటి సరఫరా విభాగాలలో వాల్వ్ ఆపరేటర్లు, ఎలక్ట్రికల్ హెల్పర్స్, ఫిట్టర్ హెల్పర్లు, గార్డెనర్లకు సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని కోరారు. జాయింట్ లేబర్ కమిషనర్ ఆదేశాల మేరకు సెమీ స్కిల్డ్ వేతనం రూ.18,500 ఇవ్వాలన్నారు. మంత్రి అమర్‌నాథ్‌తో పాటు అక్కడే ఉన్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పెందుర్తి ఎమ్మెల్యే ఎ.అదీప్‌రాజ్‌కు కూడా వినతి పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజు, జి.అప్పారావు, ఎంవి.ప్రసాదరావు, నీటి సరఫరా విభాగం నాయకులు శంకరరెడ్డి, మహేశ్వరి, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు సురేష్, నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సీర రమణ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందిస్తున్న వెంకటరెడ్డి తదితరులు


నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

రెజ్లర్లపై దాడిని ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి-పెందుర్తి : రెజ్లర్లపై దాడిని ఖండిస్తూ జివిఎంసి 96వ వార్డు పరిధిలోని పిహెచ్‌సి వద్ద ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆశా యూనియన్ మండల నాయకురాలు పద్మ మాట్లాడుతూ, మహిళలను గౌరవించడం తెలుసుకోవాలన్నారు. దేశం పేరు ప్రఖ్యాతల కోసం కష్టపడిన రెజ్లర్లపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. బిజెపి ప్రభుత్వ హయాంలో మహిళలపై దాడులు పెరిగాయన్నారు.

'దిశ' ద్వారా మహిళలకు సహకారం

ప్రజాశక్తి-సీతమ్మధార : దిశ ఫౌండేషన్ ద్వారా మహిళలకు అన్ని విధాలా సహాయసహకారాలు అందించాలని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సూచించారు. దిశ ఫౌండేషన్ సభ్యులకు మంగళవారం పార్టీ కార్యాలయంలో గుర్తింపు కార్డులను ఆయన పంపిణీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పేడాడ రమణికుమారి, ఫౌండేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ కె.స్వాతివర్మ, జిల్లా అధ్యక్షులు కంచర్ల శిరీష, ట్రైబల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నాగమళ్ల సునీత, కాకినాడ అధ్యక్షులు వెన్నెల, నార్త్ అధ్యక్షులు సుజాత, కొల్లి రవణమ్మ, సోనీ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలన్నీ అమలు'

ప్రజాశక్తి -గాజువాక : ఎన్నికల హామీలన్నింటినీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలుచేశారని బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పూర్ణానందశర్మ చెప్పారు. అగనంపూడి వైసిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పనిచేస్తున్నారని తెలిపారు. విద్య, వైద్యం పై దృష్టిపెట్టి నాడు-నేడు ద్వారా, ప్రభుత్వ పాఠశాలను, ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయికి దీటుగా అభివృద్ధి చేశారని చెప్పారు. పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రోడ్లు, కాలువలను 80 శాతం పూర్తి చేశారన్నారు.

బోనస్ పునరుద్ధరించాలని ధర్నా



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు తొలగించిన బోనస్‌ను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఉక్కు బీసీ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, బోనస్ సీలింగ్ రూ.21 వేలు దాటిందని బోనస్ తీసివేయడం అన్యాయమన్నారు. పర్మినెంటు కార్మికులకు, ఎల్ఐసి, బ్యాంకులలో పనిచేస్తున్న ఉద్యోగులకు లక్ష రూపాయల దాటి వేతనాలు వస్తున్నప్పటికీ ఎక్స్ గ్రేషియా పేరుమీద బోనస్‌ను చెల్లిస్తున్నారని, అదేవిధంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం బోనస్, ఇఎస్ఐపై ఉన్న రూ.21 వేలు సీలింగ్‌ను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్.కృష్ణ, వి.వరహాలు, ఆర్‌టి.రాజు, ఆనంద్, అంకరెడ్డి శ్రీను, కె.మల్లేశ్వరరావు, జి.సతీష్, ఎన్.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మంగళవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, వావిలపల్లి ప్రసాద్, మాజీ కార్పొరేటర్ ముప్పల పోలారావు, నాయకులు పీలా వెంకటలక్ష్మి, నీలి రవి, కిరణ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అమెరికన్ ఆంగ్లశైలిపై శిక్షణ

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పౌర గ్రంథాలయంలో అమెరికన్ ఆంగ్ల శైలిపై ఈనెల 9, 10 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు బాదంగీర్ సాయి ఓ ప్రకటనలో తెలిపారు. తన్మయ క్రియేటర్స్ ఆధ్వర్యాన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


పుక్కళ్ల ధనలక్ష్మీశంకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రతినిధులు

ఘనంగా పుక్కళ్ల పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి-విశాఖపట్నం : సుభీభవ ఇన్ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత, వైసిపి 18వ వార్డు ఇన్‌ఛార్జి పుక్కళ్ల ధనలక్ష్మీశంకర్ పుట్టినరోజు వేడుకలు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా పుక్కళ్ల ధనలక్ష్మీశంకర్ మాట్లాడుతూ, తమ సంస్థ పేరుతోనే అనేక కార్యక్రమాలు చేస్తూ వచ్చామన్నారు. ప్రజల ఆదరాభిమానాలతోనే వైసిపిలో చేరి ప్రజలకు మెరుగైన సేవలనందిస్తూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ నాయకులు, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అండిబోయిన లక్ష్మికి సన్మానం

ప్రజాశక్తి -గాజువాక : ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి యోగాలో బంగారు పతకం సాధించిన ప్రముఖ న్యాయవాది అండిబోయిన లక్ష్మికి ఏపీ ఈపీడీసీఎల్ సిజిఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇదివరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు సాధించి, ఇప్పుడు యోగాలో కూడా జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడం గొప్ప విషయం అని కొనియాడారు. ఇంకా ఎన్నో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ సిజిఆర్ఎఫ్ ఇండిపెండెంట్ మెంబర్ సురేంద్ర కుమార్, యాత, శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశైన, సంక్షేమ సంఘం అధ్యక్షులు అండిబోయిన అప్పారావు, తోకాడ అప్పారావు, ఒడిబోయిన శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మికి శాలువాకప్పి సన్మానిస్తున్న సత్యనారాయణ

ప్రమాద బాధితులకు సంతాపం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు జనసేన అధ్యక్షులు ముమ్మన మురళి ఆధ్వర్యాన రైల్వే ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపాన్ని తెలియజేశారు. జపాన్, జర్మనీ, సింగపూర్ వంటి దేశాలలో డ్రైవర్ లేకుండా బుల్లెట్ ట్రైన్స్ విజయవంతంగా నడుపుతుంటే, మన దేశంలో ఇంకా సిగ్నల్ ప్రాబ్లమ్స్ వల్ల రైలు ప్రమాదాలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

సాంస్కృతిక అంశాలతో సామాజిక అవగాహన


ప్రజాశక్తి -ములగాడ : సాంస్కృతిక అంశాలైన నాటికలు, నృత్యాలు, కళారూపాల ద్వారా సామాజిక సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జాతీయ సేవా పథక కార్యకర్త కె.లావణ్య కోరారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ, సమాజంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని రూపుమాపడానికి కళారూపాలను ఉపయోగించుకోవాలని సూచించారు. చిన్నారులు, యువకులు చిన్నచిన్న నాటికలను, నృత్య రూపకాలను ప్రదర్శించాలని కోరారు. ప్రముఖ కవి కె.సత్తిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్మిక నాయకులు బి.సత్యానందం, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ మాట్లాడారు. అనంతరం చిన్నారులకు నాట్యంలో లావణ్య శిక్షణ ఇచ్చారు.

చంద్రబాబు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : టిడిపి మహానాడులో చంద్రబాబు ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు. గాజువాక టిడిపి కార్యాలయంలో మంగళవారం 86వ వార్డు టిడిపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త ఓట్లు నమోదు కార్యక్రమం త్వరలో చేపడతారని, నమోదులు చేయించాలని కోరారు. 86వ వార్డు అధ్యక్షులు నల్లూరి సూర్యనారాయణ ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో కనకరాజు, శ్రీను, జగదీష్, అప్పారావు పాల్గొన్నారు.

జోన్-3 ఎఎంఒహెచ్‌గా రాజేష్



ప్రజాశక్తి-సీతమ్మధార : జోన్ -3 ఎఎంఒహెచ్‌గా రాజేష్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన సునీల్ కుమార్ ను జోన్-5కు బదిలీచేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ, జోన్ -3 పరిధిలో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి సుజల స్రవంతి నిర్మాణమే శరణ్యం

- ప్రాజెక్టుల విషయంలో పాలకుల అలసత్వం
- సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి బాబూ జగ్జీవన్ రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణమే శరణ్యమని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. సిపిఐ అనకాపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక రోటరీ క్లబ్ హాల్లో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు సాధనకై ఉత్తరాంధ్ర సదస్సు సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాధం, టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు, సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు విజయనగరం కార్యదర్శి మాట్లాడారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో ఒక్క ప్రాజెక్టు నిర్మాణం కూడా పూర్తి చేయలేదన్నారు. ప్రాజెక్టుల విషయంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు రెండూ దొందూ దొందేనన్నారు. ఉత్తరాంధ్ర నిర్లక్ష్యానికి గురైందని, ఉత్తుత్తి ఆంధ్ర అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే తప్ప ఉత్తరాంధ్ర అనుబంధ ప్రాజెక్టులు పూర్తి కావని స్పష్టం చేశారు. డిపిఆర్‌కు అనుగుణంగా దక్కాల్సిన బడ్జెట్‌ను కేంద్రం నుంచి రాబట్టడంలో జగన్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి జనాలను సమీకరించి ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా సిపిఐ జాతీయ మాజీ కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, మాకిరెడ్డి రాము నాయుడు, జి.గురుబాబు, కెఎస్ సన్యాసిరావు, అప్పలరాజు, వైఎస్ భద్రం, మాధవరావు, నాగరాజు, వియ్యపు రాజు, ఫణీంద్ర, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి, చిత్రంలో సిపిఎం నేత కె.లోకనాథం, టిడిపి నేత నాగజగదీశ్వరరావు, సిపిఐ నాయకులు ఓబులేసు తదితరులు



మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి

ప్రజాశక్తి అచ్యుతాపురం

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి అన్నారు. అచ్చుతాపురం ఎస్ఇజెడ్ పరిధిలో ఏటిజీ టైర్ల పరిశ్రమ ఆవరణలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్క నాటి నీళ్ళు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పచ్చదనాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. పర్యావరణం కాలుష్యం కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత పరిశ్రమలపై ఉందన్నారు. వాతావరణం కాలుష్యం చెందకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని పరిశ్రమ యాజమాన్యాలకు ఆయన సూచించారు. పర్యావరణాన్ని కాపాడలని, పర్యావరణానికి సంబంధించి పలు ప్లకార్డులు ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు, పోలీసులు, అధికారులు పాల్గొన్నారు.



పేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న పట్టణ వెంకటేష్ ఫ్యాన్స్

ఘనంగా డి.రామానాయుడు జయంతి

ప్రజాశక్తి-అనకాపల్లి

మూవీ మొఘల్, శతాధిక చిత్ర నిర్మాత డి.రామానాయుడు 87వ జయంతి వేడుకలు అనకాపల్లి పట్టణ వెంకటేష్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో అనకాపల్లి గవరపాలెం పార్కుసెంటర్ వద్ద మంగళవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం పేదలకు రగ్గులు పంచిపెట్టారు. ఆంధ్రప్రదేశ్ వెంకటేష్ హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకుడు పి.చందు మాట్లాడుతూ డి.రామానాయుడు సినిమా ఇండస్ట్రీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. భారతీయ భాషలన్నింటిలో సినిమాలు తీసి గిన్నిస్ బుక్‌కి ఎక్కిన నిర్మాతగా దాదా సాహెబ్ పాల్కే అవార్డ్‌ని అందుకున్న రామానాయుడు కొత్త, పాతతరం నిర్మాతలకు రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ వెంకటేష్ హెల్పింగ్ హాండ్స్ టీం ద్వారా ఇటీవల ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆదోని పట్టణానికి చెందిన వెంకటేష్ అభిమాని జ్ఞానేశ్వర్ కుటుంబానికి రూ.75000 వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ వెంకటేష్ ఫాన్స్ అధ్యక్ష, కార్యదర్శులు లాయర్ శ్రీను, బి.రోషన్ కుమార్, కొంగా నాగేశ్వరరావు, గొంతెన వెంకట్, పలివెల రాము, రాయి వెంకట రమణ, రానా ఫాన్స్ టౌన్ ప్రెసిడెంట్ సోమేష్, పట్టణ ప్రభాస్ ఫాన్స్ అధ్యక్షుడు జివిఎల్ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం ఎండ.. సాయంత్రం వర్షం

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని తాళ్ళపాలెం పరిధిలో మంగళవారం ఉదయం నుండి ఎండ విపరీతంగా కాసింది. మధ్యాహ్నం అయ్యే సరికిగా బయటకు రాలేని స్థితి నెలకొంది. ఎండకు ఉక్కపోత కూడా తోడు కావడంతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం అయ్యే సరికి వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమై సాయంత్రం 6.20 గంటల తర్వాత భారీగా గాలులు వీచాయి. వర్షం జల్లులు కురిశాయి. మూడు రోజుల పాటు తీవ్ర ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఈ వర్షానికి కొంత సేదతీరారు. ఎక్కువ వర్షం పడితే మెట్టు ప్రాంత భూములకు ఉపయోగకరంగా ఉందని రైతులు తెలిపారు. గాలితో కూడిన వర్షం పడడంతో మామిడి పంటకు కొంత నష్టం వాటిల్లింది. చివరి దశలో ఉన్న మామిడి కాయలు నేలరాలిపోయాయి.

వామపక్ష ఉద్యమ నేత మాకిరెడ్డి గుండెపోటుతో మృతి

- తుదిశ్వాస వరకు వీడని పోరుబాట
- ప్రజా ఉద్యమానికి తీరని లోటు : సిపిఎం

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్



మాకిరెడ్డి (ఫైల్‌ఫోటో)

నర్సీపట్నం ప్రాంత భూ పోరాట యోధుడు, వామపక్ష ఉద్యమ నాయకుడు మాకిరెడ్డి ఎర్రినాయుడు అలియాస్ మాకిరెడ్డి (76) గుండె పోటుతో మంగళవారం సాయంత్రం మృతి చెందారు. రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురైన మాకిరెడ్డిని విశాఖపట్నం కిమ్స్ ఐకాన్ (విశాఖ డెయిరీ) అసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజు 1947 ఆగస్టు 15న మాకిరెడ్డి నర్సీపట్నం మండలం గబ్బాడలో జన్మించారు. వామపక్ష ఉద్యమం ప్రభావంతో చదువుకుంటున్న సమయంలోనే విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్ నాయకునిగా ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. డిగ్రీ అనంతరం సిపిఐ నాయకునిగా ఆయన అనేక భూ పోరాటాలు నిర్వహించారు. పేదలకు వేలాది ఎకరాల భూమి దక్కడంలో ఆయన చేసిన కృషి మరువలేనిది. నర్సీపట్నం, కోటవురట్ల, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం, రోలుగుంట మండలాలతో పాటు అటు రావికమతం, వి.మాడుగుల మండలాల్లోనూ ఆయన నాయకత్వంలో చేసిన పోరాటాల ఫలితంగా వేలాది మంది పేదలకు వేల ఎకరాలు భూములు దక్కాయి. 1993లో సిపిఎంలో చేరిన మాకిరెడ్డి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. సిపిఎం డివిజన్ కార్యదర్శిగా పని చేసిన ఆయన ఇక్కడ ఉద్యమం విస్తరణకు కృషి చేశారు. కుల వివక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో మాకిరెడ్డి కీలకపాత్ర పోషించారు. వ్యవసాయ కార్మికులకు కూలి రేట్ల పెంపు కోసం ఉద్యమించారు. ప్రస్తుతం సమాచార హక్కు చట్టం కార్యకర్తగా పలు వేదికల్లో పని చేస్తున్నారు. తుదిశ్వాస వరకు ఆయన పోరుబాట వీడలేదు.

ప్రజా ఉద్యమానికి తీరని లోటు

వామపక్ష ఉద్యమ నేత మాకిరెడ్డి మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాకిరెడ్డి మృతికి సంతాపం, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు రాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వామపక్ష పార్టీలలో సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన పోడు భూముల పోరాటంలో ఆలు పెరగకుండా పనిచేశారని కొనియాడారు. ఈ ప్రాంత దళిత, గిరిజన, బడుగు బహీన వర్గాల ప్రజల భూ సమస్యలపై పనిచేశారని తెలిపారు. మాకిరెడ్డి మరణం నర్సీపట్నం ప్రాంత ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని రాజు పేర్కొన్నారు.

ఎంపిడిఓ కార్యాలయ సూపరింటెండెంట్ బదిలీ

ప్రజాశక్తి- కె.కోటపాడు

కె.కోటపాడు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ మంజుల రాణి విశాఖపట్నం జిల్లా పరిషత్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడి సూపరింటెండెంట్‌గా జి.మాడుగుల ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న అప్పలరాజు రానున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ డి.గౌరవపతిరావు చోడవరం పిఆర్ సబ్ డివిజన్‌కు బదిలీపై వెళ్తున్నారు.

సర్వీస్ రోడ్డు నిర్మాణానికి హైవే అధికారుల అంగీకారం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి - ఆనందపురం జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న రైతులకు సర్వీసు రోడ్డు నిర్మాణం చేయడానికి నేషనల్ హైవే అధికారులు అంగీకరించారు. హైవేకి ఆనుకుని ఉన్న సుమారు 600 ఎకరాల సాగు భూమి రైతులు అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బి.వి.సత్యవతిని కలిసి సాగు భూమికి వెళ్ళవలసిన రహదారి సమస్యను వివరించారు. అక్కడ నిర్మించిన బ్రిడ్జి వద్ద నుండి వస్తున్న వర్షపు నీరు సాగు భూమిలోకి చేరి పొలాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, అందు కోసం ఒక అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మించమని కోరారు. ఎంపీ వెను వెంటనే స్పందించి నేషనల్ హైవే అధికారులకు సమస్యను వివరించి, వారిని రప్పించి సమస్యను పరిశీలించారు. నేషనల్ హైవే అధికారులు స్పందించి ఫెన్సింగ్‌ను తీసి వేయించి ఒక సర్వీస్ రోడ్డును నిర్మాణానికి అంగీకరించారు. పనులు ప్రారంభించినందుకు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఎంపీ సత్యవతికి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపల్‌ను అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ : నర్సింగ్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన విజయవాడ గ్రామీణ మండలం అంబాపురంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ కళాశాల (నర్సింగ్ కాలేజి) ప్రిన్సిపాల్, చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామ్మూర్తి, జిల్లా అధ్యక్షుడు వై.నూకరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సదరు ప్రిన్సిపాల్ నర్సింగ్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినందున, తక్షణమే విచారణ జరిపించాలని కోరారు. భద్రాచలం, నూజివీడు, విస్సన్నపేట తదితర ప్రాంతాల నుండి సుమారు 83 మంది విద్యార్థినులు హాస్టల్లో వుండి నర్సింగ్ చదువుకొంటున్నారని తెలిపారు. ఆ విద్యార్థినుల శరీరంపై చేతులు వేసి తాకడం, అసభ్యకరంగా మాట్లాడం చేసేవాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్న విషయాన్ని వారు ప్రస్తావించారు.



ముంపు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపి డాక్టర్ సత్యవతి

గ్రామాల్లో ఊర కుక్కల స్వైర విహారం

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని పలు గ్రామాల్లో ఊర కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇటీవల కాలంగా ఊర కుక్కల దాడిలో పలువురు చిన్నారులు, వృద్ధులు గాయాల పాలైన సందర్భాలున్నాయి. ఒంటరిగా సంచరిస్తున్న పశువులపై మూకుమ్మడి దాడి చేసి చంపి వేస్తున్నాయి. మండలంలో ప్రతిరోజు ఎక్కడో దగ్గర ఇటువంటి సంఘటనలు జరుగుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ మధ్యకాలంలో మండలంలోని చౌడువాడ, సీమనాపల్లి, గొట్లాం, పాతవలస గ్రామాల్లో పిచ్చికుక్కలు దాడి చేయడంతో అనేక మంది గాయపడ్డారు. వారంతా స్థానిక 50 పడగల ఆసుపత్రిలో చికిత్సలు తీసుకుని ప్రాణాపాయం నుండి గట్టెక్కారు. గతంలో పంచాయతీ స్థాయిలో ఊర కుక్కల నిర్మూలన చేపట్టేవారు. కొందరు ప్రత్యేక వర్గాల వారు ఈ కుక్కల నిర్మూలనలో పాల్గొనేవారు. వారికి పంచాయతీ నిధులు సమకూర్చేవి. ప్రస్తుతం పారిశుధ్య పనులకే పంచాయతీల్లో సొమ్ములు లేవని, ఇక కుక్కలు నిర్మూలన ఏ విధంగా చేయగలమని సర్పంచులు చెబుతున్నారు. వృథాగా పడవేసిన కోళ్ల వ్యర్థాలను, పశువుల కళేబరాలను తినడంతో కొన్ని ఊర కుక్కలు పిచ్చిగా ప్రవర్తిస్తున్నాయి. ఇటువంటి వాటితో మరింత ప్రమాదమని పశువైద్యాధికారులు చెబుతున్నారు. తక్షణమే పెరుగుతున్న ఊర కుక్కలను నిర్మూలన చేసి ప్రజలను, పశువులను రక్షించాలని పలువురు కోరుతున్నారు.



కె.కోటపాడులో గుంపుగా ఉన్న కుక్కలు

అత్యాచారానికి పాల్పడిన యువకుడు అరెస్టు

ప్రజాశక్తి-కశింకోట



నిందితుడు నాగేంద్రబాబు

19 ఏళ్ల యువతిపై అత్యాచారం చేసిన మండలంలోని పల్లపు సోమవారం గ్రామానికి చెందిన కరణం వెంకట నాగేంద్రబాబు (23)ను పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కశింకోట పోలీసుల కథనం ప్రకారం.... కశింకోట మండలం నరిశింగబిల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం 19 ఏళ్ల యువతి నిలబడి ఉంది. ఆ సమయంలో అక్కడకు బైక్‌పై వచ్చిన కరణం వెంకట నాగేంద్రబాబు ఆ యువతికి మాయమాటలు చెప్పి బైక్ ఎక్కించుకున్నాడు. అక్కడ నుండి రైల్వే గేటు పక్క నుండి డ్రైనేజీలోకి బలవంతంగా తీసుకెళ్లి సదరు యువతిపై అత్యాచారం చేశాడు. దీంతో ఆ యువతి సోమవారం రాత్రి కశింకోట ఎస్ఐ ఆదినారాయణ రెడ్డికి ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై కేసు నమోదు చేసిన పోలీసులు అనకాపల్లి రూరల్ సీఐ రవికుమార్ మంగళవారం పల్లపు సోమవారం గ్రామంలో దర్యాప్తు చేశారు. నిందితుడు కరణం వెంకట నాగేంద్రబాబు తన పాత ఇంటి స్లాబ్‌పై ఉండగా ఆయన్ను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి అనకాపల్లి కోర్టు తరలించారు. కోర్టు రిమాండ్ విధించింది. ఎస్ఐ ఆదినారాయణ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ప్రమాద క్షతగాత్రులకు ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఇటీవల ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో గాయపడిన విశాఖ వాసులను మంగళవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున అందించి తన దాతృత్వాన్ని చాటుకు న్నారు. ఆర్థిక సాయం పొందిన వారిలో 37వ వార్డ్ జబ్బరతోటకు చెందిన గుండ్లు రాజారావు(61), సూరిబీస శ్రీనివాస్(58), చింతపల్లి రాజు(54), పెయిందొరపేటకు చెందిన కురమణ వెంకటరమణ (51), 39వ వార్డు కోటవీధికి చెందిన మడ్డు సత్యం(74) ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదన రావు, వైసిపి 37వ వార్డ్ అధ్యక్షుడు నొల్లు పోతుస్వామి, మీసాల అశోక్ కుమార్, కాసారపు వాసు, చింతకాయల వాసు, రామరాజు, శ్రావణ్, ధనరాజు, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి

- టిడిపి ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ

- బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

రైలు ప్రమాద మృతులకు శాంతి చేకూరాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ రైలు ప్రమాద బాధితులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైలు ప్రమాద క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. మృతుల కుటుంబాలలో ఒకరికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. ప్రమాదానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోలారపు త్రినాథ్, బొద్దపు ప్రసాద్, సబ్బవరపు గణేష్, కొణతాల రత్న కుమారి, ఆళ్ళ రామచంద్రరావు, ఆకుల నానాజీ, సూరే సతీష్ కుమార్, ధనాల విష్ణు చౌదరి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

సంపూర్ణ గృహ హక్కు పత్రాలు మంజూరు

ఇన్‌ఛార్జి ఎంపిడిఓ ధర్మారావు



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ఎంపిడిఓ ధర్మారావు

ప్రజాశక్తి-అనకాపల్లి

అధికార, అనధికార గృహనిర్మాణాలకు క్రమబద్ధీకరణతో కూడిన సంపూర్ణ హక్కులు కల్పించేందుకు గ్రామాల్లో జగనన్న సంపూర్ణ శాశ్వత భూహక్కు, గృహహక్కు పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో ధర్మారావు తెలిపారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని మెట్టపాలెం, అల్లికానుడిపాలెం గ్రామాలు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైనట్లు చెప్పారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, సర్వే డిపార్టెంట్లు సంయుక్తంగా ఆయా గ్రామాల్లో సర్వే చేపట్టి భూయాజమాన్య హక్కులను నిర్ధారిస్తాయని తెలిపారు. దీనికి పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సర్వే సిబ్బంది ప్రత్యేక శిక్షణ పొందారన్నారు. ఈ పథకం ద్వారా అనధికార గ్రామకంఠం, ప్రభుత్వ స్థలంలోని గృహ నిర్మాణాలతోపాటు జిరాయితీ, సొంత భూముల్లోనూ ల్యాండ్ కన్వర్షన్ లేకుండా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సర్వే జరిపించి, తద్వారా వాటిని మ్యాపింగ్ చేయడం, వాటికి పూర్తి హద్దులతో కూడిన సంపూర్ణ గృహహక్కు పత్రాలను అందజేయడమే ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. అన్ని గ్రామాలలో మెరుగైన సాంకేతికతతో సర్వే జరిపి, గృహాల మ్యాపింగ్ చేయడం, శాశ్వత గృహహక్కు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా గ్రామాల్లో సర్వేకు వచ్చిన సిబ్బందికి పూర్తి సమాచారం ఇచ్చి సహకరించాలని ఎంపిడిఓ ధర్మారావు కోరారు.

ఎంపిడిఓకు జన్మదిన శుభాకాంక్షలు

అనకాపల్లి ఇన్‌ఛార్జి ఎంపీడీవో ధర్మారావు జన్మదినం సందర్భంగా మంగళవారం కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఆయన పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిషత్ సమావేశమందిరంలో నిర్వహించిన సమావేశంలో వీరంతా ఎంపీడీవో ధర్మారావుకు పుష్పగుచ్ఛాలు, మెమొంటోలను అందజేశారు.

స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ గంగరాజు మృతి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట



గంగరాజు (ఫైల్‌ఫోటో)

మండలంలోని దిబ్బిడి ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ నాయకుడు సియ్యాద్రి గంగరాజు (38) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విద్యా కమిటీ చైర్మన్‌గా దిబ్బిడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధిలో గంగరాజు కీలక బాధ్యత వహించి నాడు నేడు పనుల్లో పాఠశాలల సుందరంగా తీర్చిదిద్దారు. పార్టీ కార్యక్రమాల్లో సైతం చురుగ్గా వ్యవహరించే వారు. కొద్ది రోజులుగా గంగరాజు అనారోగ్యంతో బాధపడుతూ అకస్మాత్తుగా మృతి చెందారు.



మొక్కలు నాటుతున్న ఎంపిపి కలగా లక్ష్మి తదితరులు

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ

ప్రజాశక్తి- కశింకోట

మొక్కలు పెంచడం ద్వారా కాలుష్యం నివారించవచ్చని మండల పరిషత్ అధ్యక్షురాలు కలగా లక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు అందుబాటులో ఉన్న చోట మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడం ద్వారా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు పెంటకోట జ్యోతి, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, మంత్రి జయరజని, ఎమ్‌పిడిఓ రవికుమార్, ఉపాధి హామీ పథకం ఎపిఓ శివ, హౌసింగ్ ఏఈ వి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎన్ రమేష్ పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-అనకాపల్లి

తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణీ జగదీశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం మలేరియా మాసోత్సవాలు సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాసోత్సవాలు ఈనెల ఒకటి నుంచి 30 వరకు జరుగుతాయన్నారు. మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ డి.శారద, ఎంపీహెచ్ఈవో జమ్ము శ్రీనివాసరావు, సిబ్బంది ఆర్‌వి నాగేశ్వరరావు, మరియమ్మ, మాణిక్యంబ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎంపీహెచ్ఏలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ పండగ




ముత్యాలమ్మకు పూజ చేస్తున్న మాజీ మంత్రి బండారు

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలో కొలివైన ముత్యాలమ్మ తల్లి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పల నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా, జాజుల చిన్నారావు, చింతకాయల అమర్, చింతకాయల ముత్యాల రావు, సురాడ ఎల్లాజీ, చిన్నారావు, చింతకాయలు సతీష్, సురాడ కృష్ణ, తిత్తి మహేష్, అర్జీల్లి నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

తుంపాలమ్మ అమ్మవారి పండగ

కశింకోట : మండలంలోని అచ్చర్ల గ్రామంలో శ్రీతుంపాలమ్మ అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు నైనంశెట్టి రమణరావు ఆధ్వర్యంలో వారికి ఘనంగా స్వాగతం పలికారు. శాలువా కప్పి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొట్టి బాలాజీ, కాయల మురళి, ఉగ్గిన రమణ మూర్తి, గొంతిన శ్రీనివాసరావు, సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు బుద్ధిరెడ్డి అప్పుడు, షేక్ దర్గా, కలగా సోమేశ్వర రావు, నైనంశెట్టి భూషణ్, దుద్దేటి శ్రీను, వెంకట అప్పారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తుంపాలమ్మ అమ్మవారి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పీలా

రాజకీయాలకు అతీతంగా సంక్షేమం



గడపగడపలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-గొలుగొండ : రాజకీయాలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మంగళవారం సాలిక మల్లవరం, శివారు గ్రామాలైన వెంకటాపురం పొగచెట్లపాలెం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలు అమలుపైనా, సమస్యలపైనా ఆరా తీశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపిపి జక్కు నాగమణి, పార్టీ అధికార ప్రతినిధి జక్కు నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఎఎస్ఎంసి అధ్యక్షుడు సత్యనారాయణ, రమేష్, సర్పంచ్‌లు సంతోష్, రామకృష్ణ, రాజు, బుజ్జి, చిన్నయ్యపాలెం నాయుడు, పత్తి రమణ పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు

ప్రజాశక్తి -కోటవురట్ల : రెవెన్యూ ఉద్యోగుల బదిలీలలో భాగంగా కోటవురట్ల మండల రెవెన్యూ కార్యాలయంలో పలువురికి స్థానచలనం కలిగింది. తహశీల్దారు వైఎస్‌వివి ప్రసాద్‌రావును గొలుగొండ బదిలీ చేయగా, గత కొంతకాలంగా ఇక్కడే డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న జానకమ్మను కోటవురట్ల రెగ్యులర్ తహశీల్దార్‌గా నియమించారు. మండల సర్వేయర్ వరప్రసాద్ నర్సీపట్నం బదిలీ అయ్యారు, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ కె.వెంకటలక్ష్మి నర్సీపట్నం ఎంఆర్ఐగా,కోటవురట్ల విఆర్ఒ అప్పారావును రోలుగుంట మండలం జగ్గంపేటకు, కైలాసపట్నం విఆర్ఒ సిహెచ్ శ్రీకాంత్‌ను నక్కపల్లికి, బోడపాలెం విఆర్ఒ జిఎస్ఆర్ఎన్ రత్నం(ఆశా)ను ఇదే మండలంలోని పందూరుకు బదిలీ చేశారు. ఆఫీస్ సబార్డినేట్ వి సుజాతను నర్సీపట్నం బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ఈమె కోటవురట్లలో పోస్టింగ్ అయినప్పటికీ, డెప్యుటేషన్‌పై అక్కడే పనిచేస్తున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఉపాధి చట్టం పరిరక్షణకు
ఐక్యంగా ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి : వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో ఉన్న నేటి తరుణంలో కూలీలను ఆదుకుంటున్న ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని నెల్లిపూడిలో ఉపాధి కూలీలతో సమావేశంలో మాట్లాడుతూ, పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పోరాడి చట్టాన్ని కాపాడేందుకు కూలీలంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రోజువారీ రూ.600 వేతనంతో ఏడాదికి 200 రోజులు పనికల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు భరణికుల రాము, సిఐటియు జిల్లా నాయకులు మామిడి నానాజీ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ ఇళ్లకు బిల్లులు ఇవ్వం!

కావాలంటే కొత్తగా నిర్మించుకోండి
ఖరాఖండీగా స్పష్టం చేసిన ఎమ్మెల్యే
విస్తుపోయిన మహిళా లబ్ధిదారులు



ఇళ్ల బిల్లుల కోసం ఎమ్మెల్యేకు మొరపెట్టుకుంటున్న మహిళలు

ప్రజాశక్తి -కోటవురట్ల: తెలుగుదేశం హయాంలో ఎన్‌టిఆర్ హౌసింగ్ స్కీం కింద నిర్మించిన ఇళ్లకు బిల్లులు ఇచ్చే ప్రసక్తే లేదని స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మహిళా లబ్ధిదారుల ముఖానే కుండబద్దలుగొట్టినట్లు పునరుద్ఘాటించారు. మంగళవారం పాములవాక గ్రామంలో గడపగడపకు మన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు ఇళ్ల బిల్లులు చెల్లించాలని పలువురు మహిళా లబ్ధిదారులు మొరపెట్టుకున్నారు. దీనికి ఎమ్మెల్యే చెప్పిన సమాధానంతో అంతా అవాక్కయ్యారు, ఎన్‌టిఆర్ పేరుతో నిర్మించిన కాలనీ ఇళ్లకు బిల్లులు ఇచ్చేది లేదని, కావాలంటే కొత్తగా మంజూరు చేస్తాం, కట్టుకుంటే బిల్లులు ఇస్తామంటూ నిర్మొహమాటంగా తేల్చిచెప్పారు. మొదటి కట్టిన దానికే బిల్లులు అందక అవస్థలు పడుతుంటే, ఇపుడు మళ్లీ కట్టుకునేదెలాగని పలువురు మహిళలు ఎమ్మెల్యే బాబూరావును ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన అప్పట్లో చేపట్టిన పనులకు బిల్లులు ఇవ్వకుంటే నేతలు కాదని, మామూలు లబ్ధిదారులేనన్న విషయాన్ని నేతలు గుర్తించాలని వేడుకున్నారు. అప్పట్లో నిర్మించిన మరుగుదొడ్లకు బిల్లులు ఇవ్వలేదని, విన్నవించారు. సమస్యలు చెప్పండి పరిష్కరిస్తామంటూ ఇంటింటికీ వచ్చి, తాము చెప్పిన సమస్యలను కాకుండా ఇంకేంటి పరిష్కరిస్తారో చెప్పాలని కొందరు మహిళలు గుసగుసలాడడం కనిపించింది.

అనంతరం ఇంటింటికి వెళ్లగా, విద్యుత్, తాగునీరు, పారిశుధ్య సమస్యలను విన్నవించగా, తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డ్వాక్రా నిధులు స్వాహాపై కొందరు మహిళలు ఫిర్యాదు చేయగా, సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రాల భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి దత్తుడు రాజు, స్థానిక సర్పంచ్ సత్యవతి, మాజీ ఎంపిపి సాయి, ఎంపిడిఒ చంద్రశేఖర్, తాహశీల్దార్ జానకమ్మ పాల్గొన్నారు.

ఆదరణ పథకాన్ని పునరుద్ధరించండి



ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -ఎస్.రాయవరం : బిసి వృత్తిదారులను ఆదుకునేందుకుగత టిడిపి ప్రభుత్వ హయాంలో అమలుచేసిన ఆదరణ పథకాన్ని పునరుద్ధరించాలని మండల టిడిపి అధ్యక్షుడు అమలకంటి అబద్ధంతోపాటు పలువురు మత్స్యకారులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపిడిఒను కలిసి వినతిపత్రం అందజేశారు. మత్స్యకార గ్రామమైన రేవుపోలవరం మత్స్యకారులు చేపల వేటకు వలలు ఇతర పనిముట్ల కోసం ఎనభై మంది దరఖాస్తు చేసుకుని, సుమారు రూ.రెండు లక్షలను డిడి రూపంలో ప్రభుత్వానికి డబ్బులు చెల్లించామన్నారు. తర్వాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పథకాన్ని కొనసాగించకుండా, తాము కట్టిన డిపాజిట్ వాపసు చేయకుండా అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వైసిపి నాలుగేళ్ల పాలనలో మత్స్యకారులకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. ఆదరణ పథకానికి తాము కట్టిన డిపాజిట్ డబ్బులు వాపసు చేయడమో, లేకుంటే పథకాన్ని పునరుద్ధరించి, పనిముట్లు అందించడమో ఏదో ఒకటి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోడ లోవరాజు, గంపల అప్పన్న ఎరిపల్లి రమనబాబు చేపల గోవిందు, గనగల్ల గోపాలకృష్ణ, ఏరిపల్లి జగదీష్ పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి

ప్రజాశక్తి- ఎస్ రాయవరం : ఒడిశా ఘోర రైలు ప్రమాద మృతులకు మండలంలోని ధర్మవరం అగ్రహారంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో వెలిగించిన కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా భరోసానిచ్చి ఆదుకోవాలని కోరారు. అలాగే ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన వారికి కోలుకునే వరకు మెరుగైన ఉచిత వైద్యసేవలను అందించాలని కోరారు. సంఘటనలు పునరావతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో కర్రి శ్రీనుబాబు, శ్రీపాదుల గోవిందరావు, కర్రి బాబూరావు, బండి నాగేశ్వరరావు, సుంకర శ్రీనివాసరావు, బండి శివమణి, కర్రి కోటేశ్వరరావు, నగిరెడ్డి ఆదినారాయణ, కర్రి నాగు, బండి పేరయ్య, శియ్యాదుల విక్కీ పాల్గొన్నారు

దొంగతనాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-గొలుగొండ : దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేడిపేట ఎస్ఐ ఉపేంద్ర సూచించారు. మంగళవారం రామచంద్రపురంలో వేసవి దొంగతనాలపై అవగాహన కల్పించారు. కె.శ్రీనివాసరావు, భరతుడు, పి.యుగంధర్, కేడిపేట పోలీస్‌సిబ్బంది ద్వారపురెడ్డి దుర్గాప్రసాద్, కె.వెంకటేష్ పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకు గ్లూకోజ్ ప్యాకెట్లు

ప్రజాశక్తి -నక్కపల్లి : స్థానిక బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ క్రీడాకారులకు గ్రామానికి చెందిన కాసింశెట్టి నాగు మంగళవారం గ్లూకోన్ డి ప్యాకెట్లును అందజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో వేసవి శిక్షణలో భాగంగా హాకీ క్రీడపై తర్ఫీదు పొందుతున్న 80 మంది క్రీడాకారులకు వేసవి దాహార్తి తీర్చేందుకు వీటిని అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో హాకీ క్లబ్ ప్రధాన కార్యదర్శి కె .తాతాజీ ,అరవింద్, ప్రశాంత్ పాల్గొన్నారు .

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పిల్లలు నిత్యం చేయాల్సిన వ్యాయామాలపై విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకరరావు అవగాహన కల్పించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే, సెల్‌ఫోన్ గేమ్‌లు కాకుండా, శారీరక శ్రమతో కూడిన ఆటలాడడం ఎంతో అవసరమన్నారు. అనంతరం పిల్లలతో ఇంగ్లీష్ అక్షరాలతో జంబ్లింగ్ గేమ్, పదాల కూర్పు చేయించారు. క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి దమయంతి పిల్లలతోదేశభక్తి గీతాలు పాడించారు. పిల్లలు చేసిన క్రాఫ్ట్ వర్క్స్ అబ్బురపరిచింది. **కోటవురట్ల** : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో మంగళవారం గ్రూప్ డిస్కషన్ అంశంపై విద్యార్థులకు రిసోర్స్‌పర్సన్ మస్తాన్ మాస్టర్ అవగాహన కల్పించారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు, కార్యక్రమంలో లైబ్రేరియన్ అప్పలనాయుడు, పలువురు చిన్నారులు పాల్గొన్నారు.

గొలుగొండ : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా మంగళవారం గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, నాయకులు జీవిత చరిత్రపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాలకు తరచుగా వచ్చి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

సమస్యలపై నిలదీయండి

ప్రజాశక్తి-గొలుగొండ : గడపగడపకూ ప్రభుత్వం పేరుతో గ్రామాల్లోకి వస్తున్న ఎమ్మెల్యే గణేష్, ఇతర నేతలను సమస్యలపై ప్రజలు నిలదీసి ప్రశ్నించాలని జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం మండలం కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షులు గండెం దొరబాబు ఆధ్వర్యంలో జనం కోసం జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, ఇతర సమస్యలు తిష్టవేసి ఉన్నాయని, హామీలే తప్ప అమలు జరగని సంక్షేమ పథకాలను నిలదీయాలని సూచించారు. జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలపై అవగాహన కలిగి, ముఖ్యమంత్రిగా ఒక్కఛాన్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అద్దేపల్లి గణేష్, రేగుబళ్ల శివ, వెలగా వెంకటరమణ, వాసం వెంకటేష్, ఠాగూర్, చిరంజీవి, కర్రి సంతోష్, కొండబాబు, పాల్గొన్నారు.

మోదమ్మ పండగలో అపశృతి

-ఉత్సవాలను తిలకించేందుకు వచ్చి వ్యక్తి మృత్యువాత



గెడ్డం శ్రీనివాస్(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-మాడుగుల : మోదకొండమ్మ పండగలో స్వల్ప అపశతి చోటు చేసుకుంది. గ్రామానిఇక చెందిన బైరా శివ ఆహ్వానం మేరకు అతని బంధువు, తూర్పు గోదావరి జిల్లా శంఖవరం మండలం జగ్గంపేట గ్రామానికి చెందిన గెడ్డం శ్రీనివాస్(50) మాడుగుల వచ్చారు. సోమవారం రాత్రి సురభి నాటకం తిలకించి ఇంటికి వెళ్ళిపోయారు. రాత్రి ఒంటిగంట సమయంలో ఛాతీలో నొప్పి రావడంతో అతని బంధువులు శివ, బైరా శ్రీను హుటాహుటిన అనకాపల్లి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డారు. దీంతో ఆసుపత్రి నుంచే శ్రీనివాస్ మృతదేహాన్ని అతని స్వగ్రామం జగ్గంపేటకు తరలించారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలోని ఉప్పారాపల్లి గ్రామ చెరువులో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. మండల తహశీల్దార్ శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టుకున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.అలాగే దార్లపూడి గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు ఎడ్ల బళ్ళను పట్టుకుని పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశామని తెలిపారు.ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టి, ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తహశీల్దార్‌గా అంబేద్కర్

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి మండల తహశీల్దార్‌గా ఎస్‌వి అంబేద్కర్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు .బుచ్చయ్యపేట మండలం నుంచి బదిలీపై వచ్చారు ఈ సందర్భంగా కొత్త తహశీల్దార్ మాట్లాడుతూ, .నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, రెవెన్యూ పరమైన సమస్యలను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

రేపు సర్వసిద్ధి పిహెచ్‌సి భవనం ప్రారంభం

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలోని సర్వసిద్ధి గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఈ నెల 8న, గురువారం సాయంత్రం 3గంటలకు స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రారంభిస్తారని డాక్టర్ ఎస్-ఎస్‌వి శక్తిప్రియ తెలిపారు.మండలంలో ఉన్న నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పశు బీమా పథకాన్ని వినియోగించుకోండి

ప్రజాశక్తి-మాడుగుల : వైఎస్‌అర్ పశు బీమా పథకాన్ని పాడిరైతులు వినియోగించుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టి నాయుడు కోరారు. మంగళవారం గొటివాడ అగ్రహారం గ్రామంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో మాట్లాడుతూ రైతులు ఈ పథకానికి ధరఖాస్తు చేసుకుంటే, పశువుల విలువను బట్టి రూ.20వేలు నుంచి రూ లక్ష వరకు బీమా పరిహారం పొందవచ్చన్నారు. వేసవిలో పశు సంరక్షణ, దూడలలో మరణాలు నివారణ, వైఎస్ సంచార పశు ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించారు.

నేడు గంటం దొర వర్ధంతికి

కృష్ణదేవిపేట తరలిరండి



గాం గంటందొర

ప్రజాశక్తి-గొలుగొండ : స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పితూరి సేనాధిపతి గాం గంటం దొర 99వ వర్ధంతిని పురస్కరించుకొని గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో అల్లూరి స్మారక పార్కులో ఉన్న గంటం దొర సమాధి వద్ద నివాళులు ర్పించడానికి గిరిజనులు తరలి రావాలని అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గిరిజనులందరూ తలోక చోట కార్యక్రమాన్ని నిర్వహించడం కాకుండా, గిరిజనులందరూ పవిత్రమైన గంటందొర సమాధి వద్దే జరపాలని, తద్వారా గిరిజనుల ఐక్యతను చాటాలని పడాల విజ్ఞప్తి చేశారు. అలాగే గిరిజనేతరులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు గంటం దొర 99వ వర్ధంతిలో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించాలని కోరారు. జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉదయం 10 గంటలకు గంటం దొర సమాధి వద్ద నిర్వహించే కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు.

శిక్షణార్థులకు కరాటే బెల్ట్ టెస్ట్



బెల్ట్ టెస్ట్‌లో పాల్గొన్న కరాటే క్రీడాకారులు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : స్థానిక స్కేటింగ్ రింగ్ వద్ద రెయిన్ రియ షాతోకన్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు కరాటే బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. తొమ్మిది మంది క్రీడాకారులు బెల్ట్ టెస్ట్ నిర్వహించామని మార్షల్ ఆర్ట్ అకాడమీ కోచ్ ప్రసాద్ తెలిపారు. వీరిలో హేమంత్ బ్లాక్ బెల్ట్ సాధించగా, వై అనన్య, బి చైతన్ ఆరంజ్ బెల్ట్ సాధించగా, ఎల్ శోభిత్ బ్లూ బెల్ట్, జస్విత భవ్య, మహాలక్ష్మి, లిఖిత్‌రామ్, ఆర్ నైతిక ఎల్లో బెల్ట్ సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, కిషోర్ పాల్గొన్నారు.

సురభి కళాకారులకు సత్కారం



సురభి కళాకారులను సత్కరిస్తున్న మాజీ సర్పంచ్ కుటుంబీకులు

ప్రజాశక్తి-మాడుగుల: కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డ్ గ్రహీత, ప్రముఖ సురభి కళాకారుడు ఆర్ వేణుగోపాలరావు, వారి బృందంలోని ఇతర సభ్య కళాకారులను మాడుగుల మాజీ సర్పంచ్ స్వర్గీయ మండల జయ శ్యామలరావు కుటుంబ సభ్యులు వారి నివాసంలో ఘనంగా సత్కరించారు. వేణుగోపాలరావుతోపాటు ఇతర కళాకారులు శాంతి, మానస వీణ, మంజులోహిణి, నైమిక, దవళిక తదితరులను సత్కరించి, వస్త్రాలు, రూ.11 వేల నగదు బహుకరించారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సతీమణి ధనలక్ష్మి, కుమారులు మండల వాసు, కనకాజీ, కుమార్తె అమ్మాజీ, కోడలు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంతోషి సుబ్బలక్ష్మి (సునీత) పాల్గొన్నారు

అంబరాన్నంటిన

ఆదివాసీ సాంస్కృతిక సంబరాలు

వాయిద్య శబ్దాలతో దద్దరిల్లిన అరకులోయ... సాంప్రదాయ నృత్యాలతో సందడిగా కళావేదిక



సంబరాల ప్రారంభ వేడుకలో మధు, మంతెన సీతారాం, అప్పలనర్స

ప్రజాశక్తి- అరకులోయ/ రూరల్ : ఎపి గిరిజన సంఘం రాష్ట్ర ఎనిమిదవ మహాసభల సందర్భంగా గిరిజన సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఆట పాట మాట అనే నినాదంతో నిర్వహించనున్న ఆదివాసీ సాంస్కృతిక సంబరాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎంబివికె ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎంపీ పి.మధు ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా తొలిరోజు మంగళవారం మునుపెన్నడూ లేని విధంగా మరుగున పడిపోయిన గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావి ప్రపంచానికి చాటిచెప్పేలా స్వాతంత్ర సమర యోధుడు, ఆదివాసీ పోరాట యోధుడు మర్రి కామయ్య కళావేదిక వద్ద ప్రదర్శించిన వివిధ కళా ప్రదర్శనలు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి. గిరిజన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించాయి.

మొదటి రోజు ఈ వేదికపై ప్రదర్శించిన 10 రకాల కళారూపాలు అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచి, పునరుజ్జీవాన్ని పోసాయి. మన్య ప్రాంతంలో జరిగే వివిధ ఉత్సవాలకు భిన్నంగా, గిరిజన సంస్కృతిక ప్రదర్శనలు స్థానికులు పర్యాటకులు ఆనందంగా తిలకించారు. గిరిజన సంస్కృతిక కళా ప్రదర్శనలను బసవ పున్నయ్య ట్రస్ట్ చైర్మన్ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారం డంకా బజాయించి ప్రారంభించారు.

సంస్కృతిక ప్రదర్శనలు ప్రారంభం నుంచే సభా ప్రాంగణం దద్దరిల్లింది. గిరిజన వాయిద్యం, పది రకాల థింసా ప్రదర్శనలు, బలి నాటకం, గిరిజన బాల బాలికల నృత్య ప్రదర్శనలు, చింతూరు కొమ్ముకోయ నృత్యం, దుమ్ముగూడ, చొంపి గ్రామానికి చెందిన గిరిజన సంస్కృతిక థింసా నృత్య ప్రదర్శనలు స్థానిక గిరిజనులతోపాటు ప్రేక్షకులు, పర్యాటకులను కట్టిపడేశాయి. అలాగే బొండం గ్రామానికి చెందిన సంకిడి పాట నృత్య ప్రదర్శనలు వీక్షకుల మనసును దోచాయి.

గిరిజన సాంస్కృతిక సంబరాల్లో పాల్గొన్న ప్రతి కళాబృందానికి ఆదివాసీ సంస్కృతిక సంబరాల నిర్వహణ కమిటీ నాయకులు గిరిజన సంఘం నాయకులు వివిధ పాఠశాలల గిరిజన ప్రధానోపాధ్యాయులు మెమొంటోలు సర్టిఫికెట్లు అందజేశారు. ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ సాంస్కృతిక ప్రదర్శనల కార్యక్రమానికి అధ్యక్షత వహించి, సజావుగా కొనసాగించారు. మాజీ ఎంపీ మధు, గిరిజన సంఘం నేతలు సురేంద్ర, మంతెన సీతారాం, రమణ, వి. ఉమామహేశ్వరరావు, వివిధ గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల ప్రతినిధులు చిట్టిబాబు, వి. మహేశ్వరరావు, కె రఘునాథ్, దేముడు, రామారావు, ప్రజానాట్యమండలి నాయకులు జోషి, రామన్న, వివి జయ గిరిజనులు వేసిన సంస్కృతిక నృత్య ప్రదర్శనలను ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు.



సంబరాల్లో ప్రదర్శించిన ఆదివాసీ సాంప్రదాయ థింసా నృత్యం....



కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేత



ప్రదర్శనలు తిలకిస్తున్న నాయకులు

సకాలంలో చెల్లిస్తే శ్రీనిధి బ్యాంకు రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీపతి

ప్రజాశక్తి -నక్కపల్లి : సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించిన డ్వాక్రా సంఘాలకు రూ. రెండు లక్షల నుంచి రూ20లక్షల వరకు రుణాలు అందిస్తామని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ బి.లక్ష్మీపతి అన్నారు. మంగళవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ శ్రీనిధి ఉన్నతి పథకం ద్వారా బ్యాంకుల ద్వారా రుణాలను పొందే లబ్ధిదారులు సకాలంలో చెల్లించాలన్నారు..రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. మహిళల్లో రక్తహీనత, పౌష్టికాహారం లోపంపై వివరిస్తూ, రాగులు, సజ్జలు, జొన్నలు వంటి చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. బాల్యవివాహాలు నిర్మూలనకు సహకరించాలని, చిన్న వయసులోనే పిల్లలు మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. సమావేశంలో శ్రీనిధి ఎజిఎం సునీత, ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఎపిఎం ఉషాదేవి, మేనేజర్ కరుణానిధి, సిసిలు రాజు, ప్రకాష్, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- ఎస్ రాయవరం : మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా పెనుగొల్లు పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ రాజశ్రీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చేయడం ద్వారా దోమలు, వాటి లార్వాలను నియంత్రించి, తద్వారా దోమలు కుట్టడం వల్ల వచ్చే మలేరియా, ఫైలేరియా,డెంగీ వంటి వ్యాధులను అరికట్టవచ్చని, దీనిపై ప్రజలంతా అవగాహన కలిగి సహకరించాలని కోరారు. ప్రజా సహకారంతోనే ఎటువంటి కార్యక్రమమైనా విజయవంతమౌతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, హెల్త్ సూపర్వైజర్స్ ఆదినారాయణమూర్తి. సాయి, హెల్త్ వెల్నెస్ సెంటర్ పర్యవేక్షకులు షేక్ అమీర్, సాజిద్, దేవరాజు, ఫిమేల్ హెల్త్ సూపర్వైజర్ నాగరత్నం ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవోపేతంగా మోదకొండమ్మ పండగ



అమ్మవారి దర్శనానికి ఘటాలతో బారులు తీరిన భక్తులు

ప్రజాశక్తి-మాడుగుల : మండల కేంద్రంలో మోదకొండమ్మ పండగ మంగళవారం వైభవంగా జరిగింది తెల్లవారుజాము నుండి అమ్మవారిని దర్శించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారి దేవాలయంతో పాటు శతకం పట్టు వద్ద భక్తులు ఘటాలతో భారీగా తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మండుటెండలో చెప్పులు లేకుండా మహిళలు ఘటాలు తీసుకొచ్చి అమ్మవారిని దర్శించుకుని సమర్పించడం విశేషం. ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నీడ కల్పించేందుకు టెంట్లు వేయడంతో భక్తులకు కొంత ఉపశమనం లభించింది.

పండుగ సందర్భంగా అమ్మవారిని వివిధ పార్టీల రాజకీయ నేతలు దర్శించుకున్నారు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, టిడిపి నేతలు దర్శించుకున్నారు. సాయంత్రం వివిధ నేల వేషాలు, బండ వేషాలతో పండగ ఊరేగింపు నిర్వహించారు. పండుగల సందర్భంగా .పలు చోట్ల ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోలీసు శాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయగా, గ్రామ పంచాయతీ పారిశు ధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

సేవా కార్యక్రమాలు

పండగ సందర్భంగా అనేక చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భోజనాలు, మజ్జిగ, మంచినీరు, ప్రసాదం వితరణ పెద్దఎత్తున పంపిణీ చేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

భారీ ఫ్లెక్సీల ఏర్పాటు

మోదకొండమ్మ పండుగ సందర్భంగా మాడుగుల పట్టణమంతా భారీ ఫ్లెక్సీలతో నిండిపోయింది. పండగ విచ్చేసిన బంధుమిత్రులు, అతిథులకు స్వాగతం పలుకుతూ వివిధ రాజకీయ పార్టీలతోపాటు వ్యాపారులు, మరికొందరు వ్యక్తిగతంగానూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయశారు. దుర్గాదేవి మోదమాంబ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు సుందరరాజు, గౌరవ అధ్యక్షులు కుక్కర మోదకొండ, ఉపాధ్యక్షులు కర్రి దేవి ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ ఆకట్టుకుంది.



ఆలయ ప్రాంగణంలో అన్నదానం